తెలంగాణలో అఖండ విజయం ఖాయం



ఆమనగల్లు: ప్లీనరీలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, వాణీదేవిల ఐక్యతారాగం



కడ్తాల్: పార్టీ జెండా ఆవిష్కరణలో ఎంపీ రాములు, ఎమ్మెల్సీ తదితరులు

- సంక్షేమ పథకాలే పార్టీకి కొండంత అండ
- ప్రజాదరణ పొందుతున్న బీఆర్‌ఎస్
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకీ ఓటమి తప్పదు
- బీఆర్‌ఎస్ మినీ ప్లీనరీలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, సురభివాణి, ఎంపీ రాములు

ఆమనగల్లు: రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో అఖండ విజయం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, సురభివాణిదేవి, రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి మినీ ప్లీనరీకి పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సభ ప్రారంభంలో తెలంగాణ అమర వీరులకు నివాళిగా కొద్దిసేపు మౌనం పాటించి, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, విజయాలు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై వివిధ తీర్మానాలు ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పాలన అందిస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిలో, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచారని, ఆయన పాలనను దేశ ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆమనగల్లు, కల్వకుర్తి మార్కెట్ చైర్మన్‌లు నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌గౌడ్, జెడ్పీటీసీలు అనురాధ, జర్పుల దశరథ్ నాయక్, విజితారెడ్డి, ఎంపీపీలు కమ్లి మోత్యానాయక్, విజయ, మనోహర, వైస్ ఎంపీపీలు అనంతరెడ్డి, శంకర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్, స్థానిక నాయకులు నిట్టి నారాయణ, కేశవులు, సయ్యద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన గులాబీ ఆవిష్కరణ

కడ్తాల్: అభివృద్ధి సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీకి కొండంత అండ అని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి, ఎంపీ, ఎమ్మెల్సీ ముఖ్య అతిథులుగా హాజరై గులాబీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, చందోజీ, నాయకులు యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, వెంకటేశ్, నరేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ రెపరెపలు

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంతో పాటు, వెంకట్రావ్‌పేట్, చుక్కాపూర్, పడకల్, దేవుని పడకల్, వెల్జాల్, చంద్రధనలో జెండాలను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ నర్సింహ, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు సజ్జుపాష, రమేష్ పాల్గొన్నారు.

దేశ్‌కీ నేత సీఎం కేసీఆర్

దేశ్‌కి నేత సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే రాష్ట్రం నంబర్‌వన్‌గా నలిచిందన్నారు.

రూ.2,391 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని రూ.2,391 కోట్లతో అభివృద్ధి పథంలో నడిచేలా చేశామని బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పరస్కరించుకుని మన్నెగూడ వేద కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలదేనని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, నాయకులు అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్, విజయానంద రెడ్డి, సంపతీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్లెక్సీ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న శ్రీకాంత్‌సింగ్ తదితరులు

ఆమనగల్లు: హనుమాన్ ఫ్లెక్సీని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హిందూదళం సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ జెండాల ఏర్పాటు కోసం హనుమాన్ ఫ్లెక్సీని తొలగించారని ఆయన ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రశ్నించే గొంతుకను అణచివేస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఆమనగల్లు: ప్రశ్నించే గొంతుకను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తుందని వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్ రెడ్డి ఆరోపించారు. న్యాయంకోసం పోరాడుతున్న పార్టీ అధినేత వైఎస్ షర్మిలను పోలీసులు అక్రమంగా అరెస్టుచేశారని ఆయన మండిపడ్డారు. ఆమె అరెస్టుకు నిరసనగా పట్టణంలో మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రశ్నపత్రాలు లీకేజీ అయితే ప్రశ్నించడం తప్పా అని పశ్నించారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. అరెస్టు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు నరేశ్, శ్రీను, రాజు, ఫిరోజ్, కృష్ణ, రాకేశ్, పవన్, జగన్, వెంకట్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ సిబ్బందికి డ్రెస్ కోడ్‌తో కూడిన చీరలను మంగళవారం చైర్ పర్సన్ కప్పరి స్రవంతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఆర్టిజన్ ఉద్యోగులు



కడ్తాల్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు, కార్మికులు

కడ్తాల్: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేపట్టగా.. కడ్తాల్ మండలంలో పలువురు విధుల్లో పాల్గొన్నారు. కడ్తాల్ 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు, కర్కల్‌పహాడ్, ముద్విన్, చల్లంపల్లి, అన్మాస్‌పల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో పలువురు కార్మికులు విధుల్లో చేరారు. మండలంలో 21 మంది ఆర్టిజన్ ఉద్యోగులు, కార్మికులు ఉండగా.. సగానికి పైగా కార్మికులు విధులకు హాజరైనట్లు ఏఈ నరేందర్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రాజకీయాలతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుంటానని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ, ఆదిబట్ల కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లో నిర్మించే కంఠ మహేశ్వర దేవాలయ నిర్మాణానికి ఈ సందర్భంగా ఆయన రూ.25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సత్తయ్యగౌడ్, యాదగిరిగౌడ్, నరేష్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులు వినియోగించుకోండి



చింతలపల్లిలో ఈజీఎస్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్

ఆమనగల్లు: కూలీలకు ఉపాధి కల్పించడానికి చేపట్టిన ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్ చెప్పారు. చింతలపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ.. పల్లెప్రగతి పనులు పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, నాయకులు యాదయ్య తదితరులు ఉన్నారు. అలాగే మాడ్గుల మండలం కాశీగుడెంలో ఎంపీడీఓ రాఘవులు పర్యటించి పల్లెప్రగతి పనులు పరిశీలించారు.

జేపీఎస్‌లను పర్మినెంట్ చేయాలి

కడ్తాల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల శిక్షణ కాలం పూర్తి అయినందున ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ జీఓ జారీ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ కందుకూర్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ జావిద్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. 2019లో నిర్వహించిన నియామక పరీక్షల్లో పేర్కొన్న విధంగా 3 సంవత్సరాల ప్రొబేషన్ పీరియడ్‌తో పాటు, అదనంగా పెంచిన మరో సంవత్సరం ఈ నెల11తో ముగిసిందన్నారు. జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తూ, నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా లెక్కించాలని, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను కూడా పర్మినెంట్ చేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరే విధంగా చూస్తూ, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమను రెగ్యులర్ చేసి, కార్యదర్శుల కుటుంబాల్లో వెలుగు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు.

మలేరియాపై అవగాహన సదస్సు



ఇబ్రహీంపట్నంలో అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్‌లు మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను మున్సిపల్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, వైద్యాధికారిణి సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చికిత్స అందిస్తే అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలు మెరుగుపడతాయని, తద్వారా రోగి ప్రాణాలు కాపాడవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్ అన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ సిబ్బందికి సీపీఆర్, ఏఈడీలపై అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ యూసుఫ్, వైద్యాధికారిణి సరిత, ఎంహెచ్ఓ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం



మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయం

28 నుంచి మే 7వరకు ఉత్సవాలు

మీర్‌పేట: దేశంలోనే ఉత్తర ద్వారంలో వెలసిన ఏకైక దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. జిల్లెలగూడ పురాతన శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయ అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అధ్యయనోత్సవాలు, మే 1నుంచి 7వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు, మే 3న శ్రీవారి తిరు కల్యాణోత్సవం, 5నుంచి 7వరకు రథోత్సవాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపనున్నట్లు చెప్పారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంతో పాటు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారు దర్శనమిచ్చే ఏకైక దేవాలయం కావడంతో ఏటా భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు.



వేంకటేశ్వర స్వామి

'ఉపాధి' పనుల పరిశీలన

తలకొండపల్లి: ఉపాధిహామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కిష్టమ్మ అన్నారు. ప్రజల కోరిక మేరకు పనులు చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. చుక్కాపూర్‌లో మంగళవారం ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై జీపీ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. 2019 డిసెంబర్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన పనుల గురించి రికార్డులను పరిశీలించి, 189 పనులు చేపట్టినట్లు గుర్తించారు. కార్యక్రమంలో డీఆర్పీ శ్రీశైలం, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నారెడ్డి, టీఏ తానయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు తరలిన బీజేపీ నాయకులు

ఆమనగల్లు: 'నిరుద్యోగుల గోస బీజేపీ భరోసా' కార్యక్రమం పేరుతో పాలమూరులో నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌కు ఆమనగల్లు పట్టణం నుంచి మంగళవారం పలువురు బీజేపీ నాయకులు వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు కండెసాయి, నాయకులు ప్రభాకర్, రవిరాథోడ్, ప్రశాంత్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు, సంఘ సేవకులు, సిరిగిరి బ్రహ్మచారి మాతృమూర్తి రంగమ్మ(97) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా.. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితో పాటు, పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు మోహన్‌రెడ్డి, విజయ్, రమేశ్, అశోక్‌రెడ్డి, జంగారెడ్డి, హన్మానాయక్, రాఘవేందర్, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పరామర్శ

మహేశ్వరం: నాగుల్‌దోని తండాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అంగోత్ నిర్మల మృతి చెందగా.. భర్త సంజు నాయక్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అనాథలైన వారి పిల్లలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి మంగళవారం పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాంసీరామ్ నాయక్, గోవింద నాయక్, సేవ్యా నాయక్, నేనావత్ రాజు నాయక్, దశరథ నాయక్, నారాయణ, కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు సస్పెండ్

మీర్‌పేట: పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరించిన కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు ఓర్సు స్వామికుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

అధికారులతో కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సర్కిల్ అధికారులను కోరారు. మంగళవారం డివిజన్ పరిధి పోచమ్మబాగ్, వెంకటేశ్వరకాలనీ రోడ్ నం.16ను కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటిని పరిశీలించి, సీవర్‌లైన్ ఫిర్యాదుకు హాజరై సమస్యను సత్వరమే పరిష్కరించాలని జలమండలి, ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించామని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో సద్గుణచారి, నర్సింహారెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

వీఓఏల డిమాండ్లు నెరవేర్చాలి



ర్యాలీ తీస్తున్న వీఓఏలు, బీఎస్పీ నేతలు

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్

కడ్తాల్: వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఆ పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో వీఓఏలు పనిచేస్తున్నారని, పనికి తగిన వేతనం చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యంతో పాటు, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య, సభ్యులు తానేశ్, బాలరాజ్, లక్ష్మి, కవిత, అనుసూయ, సుధారాణి, అరుణ, శోభ, శ్రీలత, సునీత, లావణ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముదిరాజ్ తాలూకా బహిరంగ సభ

తలకొండపల్లి: ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏ లోకి మార్చాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్, తాలూకా స్థాయి ముదిరాజ్‌ల కార్యవర్గ సభ్యుడు, ఉప సర్పంచ్ అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలోని సాయి బాలాజీ పంక్షన్‌హాల్లో ముదిరాజ్‌ల తాలూకా స్థాయి బహిరంగ సమావేశాన్ని ఈ నెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సంఘం జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతకుమారిలు ముఖ్య అతిథిలుగా హాజరవుతారని తెలిపారు. కావున నియోజకవర్గ పరిధిలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కూలీలకు 'ఉపాధి' కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

ఇబ్రహీంపట్నం: కొత్తవారికి 'ఉపాధి' కల్పించాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. యాచారంలో ఉపాధిహామీ పనులపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త పనులు కల్పించి, కూలీల జీవనోపాధికి పాటుపడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీడీ సక్రియానాయక్, ఎంపీఓ ఉమారాణి, ఏపీఓ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ అయోమయం



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: గురునానక్ యూనివర్సిటీ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం గురునానక్ కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ యూనివర్సిటీని గవర్నర్ రద్దు చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు ఆయోమయంలో పడిందని, వారికి న్యాయం చేసే విధంగా గవర్నర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా.. కళాశాల ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న విద్యార్థులను అరెస్టు చేసి వదిలిపెట్టినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వినయ్, సాత్విక్, సాయికిరణ్, కార్తిక్, అర్షిత్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్య పట్టని ప్రభుత్వం



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేస్తున్న సమ్మె మంగళవారంతో 9వ రోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల చౌరస్తా వరకు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయాల ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు మాట్లాడారు. తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సమస్య పరిష్కరించకపోతే ముందుగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు సరస్వతి, రేణుక, శారద, మౌనిక, సబిత, పద్మ, కవిత, రజని, గీత, రాధ, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.